క్లుప్తంగా

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాల నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఆమె శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో చట్టంతో విభేదించిన బాలలకు - న్యాయం, బాలల రక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. చట్టంతో విభేదించిన బాలలకు అందుబాటులో ఉన్న పథకాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఫోక్సో స్పెషల్ జడ్జి కుమారి కె.వాణిశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులి కృష్ణ, జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో కుప్పకూలిన వృద్ధుడు



వృద్ధుడిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి దిగిన ఒక వృద్ధుడు కొద్దిసేపటికి ప్లాట్‌ఫామ్‌పై కుప్పకూలాడు. రైల్వే పోలీసులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఏలూరు రూరల్ కొమడవోలు సాయినగర్‌కు చెందిన సందిపర్తి బాబురావు (58) వ్యక్తిగత పనులపై తూర్పుగోదావరి జిల్లా తుని వెళ్లారు. తిరిగి రైలులో వస్తూ పెద్దరైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం దిగారు. ప్లాట్‌ఫామ్‌పై బెంచీపై కూర్చొని ఫోన్ మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్ పేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు జిల్లా ప్రధాన కేంద్రమైన ఏలూరులోని ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆరోపించారు. కొత్తూరు, పోణంగి, మాదే పెల్లి ప్రాంతాల్లో ఇందిరమ్మ కాలనీలతో పాటు కుమ్మరి రేవులో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో నగరంలో ఇంటింటికి సీపీఎం అనే పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నాయకులు కె.శ్రీనివాస్, పంపన రవి, ఎం ఇస్సాకు, జె. గోపి తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఎదుగుదలను గమనించాలి



కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని కేపీడీటీ హైస్కూల్లో కిశోర వికాశం 2.0పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలు వయసుతో పాటు ఎదుగుదలను తల్లిదండ్రులు గమనించాలన్నారు. వారికి అందిస్తున్న ఆహారం తదితర విషయాలపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. బాలికల సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1098 సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసుర్ తులసి, డీసీపీ సీహెచ్ సూర్యచక్రవేణి, వన్ స్టాప్ సెంటర్ కృష్ణవేణి, సెక్టార్ సూపర్‌వైజర్ మంగ, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాటపర్రు హైస్కూల్లో కిశోర వికాసం



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

దెందులూరు: వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణతోనే ఏదైనా సాధించవచ్చునని చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.కృష్ణ అన్నారు. శనివారం చాటపర్రు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మురళీకృష్ణ అధ్యక్షతన కిషోర్ వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయులు, పీహెచ్ఎస్ మోహన్ బాయ్, హెచ్ఎస్ కిరణ్, ఏఎన్ఎంలు రాణి, సంధ్యారాణి, ఏఎన్ఎం సరిత, అంగన్‌వాడీ, ఆశ వైద్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరులో తూతూమంత్రంగా 'శక్తి'

- టీమ్‌లో పనిచేసేది ఇద్దరుముగ్గురేనా?
- శక్తి యాప్ రిజిస్ట్రేషన్లపై అస్పష్టత
- అవగాహనలకే పరిమితం



ఏలూరులో కాలేజీల ప్రాంతంలో శక్తి టీమ్ సభ్యులు (ఫైల్)



సత్రంపాడులో యువతులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

ఏలూరు టౌన్: మహిళలు, బాలికలు, యువతులపై నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక అభయ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం హయాంలో దిశా యాప్, దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, నేడు కూటమి ప్రభుత్వంలో పేరు మార్చి శక్తి యాప్‌గా రూపొందించారు. ఏలూరు నగరంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ యం.సుబ్బారావు పర్యవేక్షణలో శక్తి టీమ్స్‌ను పనిచేసేలా చర్యలు చేపట్టారు. కానీ ‹శక్తి›వంతంగా పనిచేస్తుందా ? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏదో జిల్లా బాస్, మెప్పుకోసమే పని చేస్తూ తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నారా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

శక్తి బృందాలెన్ని?

ఏలూరు నగరంలో శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసిన సందర్భంలో మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో మహిళా ఎస్సై ఆధ్వర్యంలో రెండు, మూడు బృందాలు పనిచేసేవి. ప్రస్తుతం ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్ మాత్రమే నిత్యం కళాశాలలు, పాఠశాలల వద్ద తిరుగుతూ కనిపిస్తున్నారు. ఒక్కోసారి నగరంలోని ఆర్ఆర్‌పేట, ఎన్ఆర్‌పేట ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో డ్రోన్ కెమెరాలను ఎగురవేస్తూ, గస్తీ తిరుగుతున్నారు. గతంలో వారంలో నాలుగు రోజులు డ్రోన్ కెమెరాలు, శక్తి టీమ్ బృందాలు కాలేజీల వద్ద నిఘా ఉండేవారు. ఎస్పీ కేపీ శివకిషోర్ ఆశించిన స్థాయిలో ‹శక్తి›వంతంగా పని చేయటం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

అవగాహనలతోనే సరి

ఏలూరు నగరంలో శక్తి యాప్ రిజిస్ట్రేషన్లు ఎన్ని చేశారో ? అధికారులకే తెలియని దుస్థితి. నామమాత్రంగా డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలు, ఉన్నత పాఠశాలల్లో, శిక్షణా కేంద్రాల్లో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు, మహిళలు, విద్యార్థినులతో మొబైల్ ఫోన్స్‌లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్లు ఏమేరకు చేయిస్తున్నారనేది సందేహమే. ఎస్పీ శివకిషోర్ నిత్యం వాటిపై ఆరా తీస్తూ ఉండడంతో, అవగాహన కార్యక్రమాలు పెట్టేసి చేతులుదులుపుకుంటున్నారనే అభిప్రాయం ఉంది. ఇక శక్తి టీమ్‌లు ఏలూరు ఆర్ఆర్‌పేట, ఎన్ఆర్‌పేటలో మాత్రమే తిరిగితే, వన్‌టౌన్ ప్రాంతం, సత్రంపాడు, వట్లూరు, విద్యానగర్ ప్రాంతంలో గస్తీ పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి.

నేడు సంపూర్ణ చంద్ర గ్రహణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేడు ఆకాశంలో సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనుంది. రాత్రి 9.56 గంటలకు గ్రహణ స్పర్శ కాలం ప్రారంభమౌతుందని, రాత్రి 11.41 గంటలకు మధ్యకాలమౌతుందని, అర్ధరాత్రి 1.26 గంటలకు మోక్షకాలం అవుతుందని పండితులు వివరించారు. ఈ మేరకు నగరంలోని అన్ని దేవస్థానాల్లో మధ్యాహ్నం స్వామి వార్లకు నివేదనలు సమర్పించిన అనంతరం ఆలయాలను మూసివేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలు దాటిని తరువాత ఆలయాల్లో సంప్రోక్షణలు చేస్తారని, అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతులు ఇస్తారని వివరించారు.

సీఐటీయూ ఏలూరు నగర అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

ఏలూరు (టూటౌన్): సీఐటీయూ ఏలూరు నగర నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వైఎస్ కనకారావు, మంచెల్ల ఇసాక్ ఎన్నికయ్యారు. సీఐటీయూ 16వ నగర మహాసభలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు.

దళితులపై దాడులు అమానుషం



జీజీహెచ్‌లో బాధితుడ్ని పరామర్శించిన నాయకులు డీఎన్ఆర్, జేపీ

ఏలూరు టౌన్: దళితులపై దాడులకు పాల్పడడం అమానవీయమనీ, పండుగల సందర్భంలో ప్రతి ఒక్కరూ మత సామరస్యంతో వేడుకలు నిర్వహించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైకలూరు రూరల్ దానిగూడెంలో గణేష్ నిమజ్జనం ఊరేగింపులో ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణతో దళిత వర్గానికి చెందిన యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జీజీహెచ్‌లో వైద్యచికిత్స పొందుతున్న బాధితుడిని పార్టీ జిల్లా నేతలు పరామర్శించారు. జరిగిన ఘటన వివరాలపై ఆరా తీశారు. పోలీస్‌లు కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలి

దానగూడెంలో దళిత వర్గానికి చెందిన యువకులపై మరో వర్గం దాడులు చేయగా తీవ్ర గాయాలయ్యాయని, బాధితులకు న్యాయం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు అబ్బూరి అనిల్ డిమాండ్ చేశారు. కైకలూరులో వినియక విగ్రహం నిమజ్జనం ఊరేగింపులో నెలకొన్న వివాదంలో గాయపడిన బాధితుడ్ని ఏలూరు జీజీహెచ్‌లో ఆయన పరామర్శించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు దాడులపై ఫిర్యాదు చేశామని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అనిల్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో నూతన ఉత్సాహం వచ్చింది. పార్టీ కోసం పనిచేసిన నాయకులకు కీలక పదవులు కేటాయించటం ఉత్సాహాన్ని నింపింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవటమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. నూతనంగా పదవులు పొందిన వారంతా ఏలూరులోని పార్టీ కార్యాలయంలో జేపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. జేపీని కలిసిన వారిలో ఏలూరు జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షులు చిలకపాటి డింపుల్ జాబ్, జిల్లా సెక్రటరీ చవ్వాన అచ్యుత కుమారి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొత్తపల్లి రాణి, పొల్నాటి పరమేశ్వరి ఉన్నారు. ఏలూరు జిల్లా సోషల్‌మీడియా ప్రధాన కార్యదర్శి బండ్లమూడి సునీల్‌కుమార్, జిల్లా సెక్రటరీ దవులూరి రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు చుండూరి పూజిత్, సరికోటి వైష్ణవనాథ్ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, బీసీ సెల్ జిల్లా సెక్రటరీ కొల్లిపాక సురేష్, జిల్లా సెక్రటరీ కె.తులసీ, నగర సెక్రటరీ మాచర్ల లోకేష్, నగర సోషల్‌మీడియా అధ్యక్షులు పచ్చిపులుసు సృజన్, గమిని శ్రీనివాసరావు, చుక్కా సత్యనారాయణ, స్వామి, రమేష్ తదితరులు ఉన్నారు.



జేపీని సత్కరించిన చిలకపాటి డింపుల్ జాబ్, ఈసీ మెంబర్లు పరమేశ్వరి, కొత్తపల్లి రాణి



జేపీని కలిసిన సోషల్‌మీడియా జనరల్ సెక్రటరీ బండ్లమూడి సునీల్, ఈసీ మెంబర్లు పూజిత్, తేజ్



జేపీకి కృతజ్ఞతలు తెలిపిన సోషల్‌మీడియా జిల్లా సెక్రటరీ దవులూరి రవి, పార్టీ నేతలు



జేపీని కలిసిన మహిళా విభాగం జిల్లా సెక్రటరీ చవ్వాన అచ్యుత కుమారి

డిప్యూటీ సీఎం పవన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గతంలో భీమవరంలో రజక వృత్తిదారులకు వృత్తి చెరువులపై శాశ్వత హక్కు కల్పిస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. శనివారం రజక జన సంఘ స్థానిక కార్యలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో కట్లయ్య మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన రజకులు పలు సమస్యలను వివరించారు. చెరువుల లీజు, ఉచిత విద్యుత్ అమలు, దోబీఘాట్లు, విశ్రాంతి భవనాలు, చెరువుల ఆక్రమణలు ఇలా అనే సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కట్లయ్య డిమాండ్ చేశారు.

కొవ్వలి గ్రామ రజక నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా కొవ్వలి గ్రామ రజక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గోవాడా శ్రీరాములు, గొల్లపూడి వెంకటేశ్వరరావు, వీరవల్లి సుబ్బారావు, అధ్యక్షుడిగా గోవాడా సుబ్రహ్మణ్యం, సెక్రటరీగా గోవాడ దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా గోవాడా రాము, జాయింట్ సెక్రటరీగా అంజి, కోశాధికారిగా సురుగులు కోటేశ్వరరావు, సలహా సభ్యులుగా గొల్లపూడి సోమయ్య, గోవాడ ఆంజనేయులు, కూరపాటి లక్ష్మి, గోవా సావిత్రిలను ఎన్నుకున్నారు. సీనియర్ నేతలు కొమ్మంటి మురళి, పెట్బాల్ శ్రీనివాసు, గొల్లపూడి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, లక్ష్మీ ప్రసన్న, కడ్డీలు సుబ్బయ్య గోవాడ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.




కుందీసెంటరులోని వినాయకుడి ఊరేగింపు



వన్‌టౌన్‌లో వినాయక ర్యాలీలో మహిళల కోలాటం

గంగ ఒడికి గౌరీ తనయుడు



రామకోటి వినాయకుడి ఊరేగింపు

ఏలూరు నగరంలో వినాయక చవితికి ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలు శనివారం నిమజ్జనానికి బయలుదేరాయి. భారీ డీజేతో యువత కేరింతల మధ్య నిమజ్జనయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. కోలాటాలు, కేరళా వాయిద్యాలతో అశేష భక్తజనవాహిని మధ్య వినాయకుడ్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఏలూరులోని వన్‌టౌన్ ప్రాంతమంతా భక్తులతో నిండిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఏలూరు శివారు తూర్పులాకుల వద్ద నిమజ్జన కార్యక్రమం ముగిసింది.

– ఏలూరు(ఆర్ఆర్‌పేట)



ఏలూరులో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



రామకోటి వినాయకుడి ఊరేగింపులో కేరళ నృత్యాలు



డీజే సాంగ్స్‌లో యువత జోష్

కస్తూరిబాలో ఎయిడ్స్‌పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరిబా హై స్కూల్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ అమృత, అదనపు డీఎంహెచ్ఓ నరేంద్ర పర్యవేక్షణలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కె.శిరీష ఎయిడ్స్ వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చెడు వ్యసనాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏఆర్‌హెచ్ఈడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీష, ఓఆర్‌డబ్ల్యూ జి.రాజేంద్ర ప్రసాద్, ఏఎన్ఎం కె.ప్రభావతి, సచివాలయం స్టాఫ్, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలను స్మరించుకోవాలి



ఎంపీపీ శ్రీనివాసరాజును సత్కరించిన ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ఉపాధ్యాయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏలూరు నగరం, రూరల్‌లో క్లస్టర్ స్థాయిలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు ఎల్ కనక దుర్గ, స్వర్ణలత, ఎస్ వరలక్ష్మి, కేఎస్ రమాదేవి, జె.జోసఫ్‌తంబి, కె.రాణి, ఎం విజయపద్మలత, ఐ.వరకుమారి, ఎస్ కృష్ణవేణితో పాటు ఎంపీపీ, ఎంపీడీఓలకు పూలదండ వేసి, శాలువ కప్పి, మెమెంటో అందించి సత్కరించారు. ఎంపీడీఓ వి శ్రీలత, ఎంఈఓ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం



విద్యుత్ ఎస్ఈని కలిసిన హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ రామాలయం ప్రాంగణం వద్ద ఒక క్రైస్తవ మృతుని పెద్దకర్మ నిర్వహించడానికి చేస్తోన్న ఏర్పాట్లను నియంత్రించాలని కోరుతూ హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు శనివారం ఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజును కోరారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు. హిందువుల ఆధ్యాత్మిక స్థలంలో ఇటువంటి అశుభ కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వరాదని కోరారు. అక్కడ పెద్ద కర్మ కార్యక్రమానికి, మాంసాహార భోజనాలకు అనుమతిస్తే విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. మాంసాహార భోజనాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. మతసామరస్యానికి విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2,11,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు రూ.1,00,000, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన బి.సుబ్బారావు రూ.1,11,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

ట్రంప్ సుంకాల రద్దుకు డిమాండ్

వేలేరుపాడు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై చేస్తున్న పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ, ట్రంప్ విధించిన సుంకాలను రద్దు చేసే విధంగా భారత ప్రభుత్వం అమెరికాపై ఒత్తిడి తేవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వామపక్షల పిలుపులో భాగంగా శనివారం వేలేరుపాడులో నిరసన వ్యక్తం చేశారు.

- **చింతలపూడి :** ట్రంప్ అధిక సుంకాలకు నిరసనగా సీపీఎం, సీపీఐ, రెడ్ స్టార్ ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేశారు. బోసుబొమ్మ సెంటర్ నుండి పాత బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.
- **కామవరపుకోట:** ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో కామవరపుకోటలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పార్టీ మండల కన్వీనర్ టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు.
- **జంగారెడ్డిగూడెం:** దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అమెరికా విధానాలను నిరశిస్తూ ధర్నా చేశాయి.